ప్రథమ చికిత్సపై శిక్షణ

శ్రీకాకుళం అర్బన్ : రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యాన ప్రథమ చికిత్స శిక్షణ ఇస్తున్నామని, దీనికి దరఖాస్తులు చేసుకోవాలని ఆ సంస్థ కార్యదర్శి బలివాడ మల్లేశ్వరావు ఒక ప్రకటనలో తెలిపారు. రెడ్‌క్రాస్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో ఈ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని వివిధ పరిశ్రమల్లో, వ్యాపార సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ఈ శిక్షణ ఉంటుందన్నారు. సెయింట్ జాన్ అంబ్యులెన్సు సూచనలను అనుసరించి పనిప్రదేశాల్లో ప్రథమ చికిత్సపై అవగహన కల్పించనున్నట్టు తెలిపారు. శిక్షణకు హాజరు కాదలచుకున్న వారు రెడ్‌క్రాస్ యాప్ ద్వారా వాలంటీరుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. నిర్ధేశించిన ఫీజులను చెల్లించి ఈ శిక్షణ పొందవచ్చన్నారు. పూర్తి వివరాలకు 9133008585, 9010273741 సెల్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

కౌలు కార్డులు అందేనా..?

- మొదలుకాని సిసిఆర్‌సి కార్డుల జారీ ప్రక్రియ
- మరికొద్ది రోజుల్లో ప్రారంభం కానున్న విత్తనాల పంపిణీ
- ఎన్నికల ప్రక్రియతో దృష్టిసారించని అధికారులు
- సకాలంలో కార్డులు అందడంపై నెలకొన్న సందేహాలు

కౌలు రైతులకు ఈ ఏడాదీ కష్టాలు తప్పేలా లేవు. కౌలు ఒప్పందాల కోసం భూ యజమానుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితులు కనిపిస్తున్నాయి. పంట సాగు హక్కుదారుల పత్రాలు (సిసిఆర్‌సి) నోచుకోలేక గత సీజన్‌లో కౌలు రైతులు అనేక ఇబ్బందులు చవిచూశారు. విత్తనాల నుంచి ధాన్యం అమ్ముకోవడం వరకు అవస్థలు పడ్డారు. ఈ ఏడాదైనా కార్డులు అందుతాయని వారంతా ఆశలు పెట్టుకున్నారు. ఎన్నికల ప్రక్రియ కొనసాగుతుండడంతో ప్రభుత్వం ఆ అంశంపై పెద్దగా దృష్టిసారించినట్లు కనిపించడం లేదు. మరోవైపు జిల్లా అధికార యంత్రాంగం కూడా కౌంటింగ్ ఏర్పాట్లపైనే ప్రధానంగా దృష్టిసారించడంతో కౌలు రైతుల గుర్తింపు ప్రక్రియ కనీసం ప్రారంభం కాలేదు. సాధారణంగా మే నెలలోనే కౌలు రైతుల గుర్తింపు కోసం గ్రామసభలు నిర్వహిస్తారు. ఈ ఏడాది ఇప్పటివరకు అటువంటి ప్రక్రియ చేపట్టకపోవడంతో, కార్డులు చేతికి ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి నెలకొంది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో అన్నిరకాల పంటలు కలిపి సుమారు 6.62 లక్షల ఎకరాల విస్తీర్ణం మేర సాధారణ సాగుగా ఉంది. అందులో ఈ ఏడాది 3.87 లక్షల ఎకరాల్లో వరి వేసేందుకు రైతులు సమాయత్తమవుతున్నట్లు అధికారులు చెప్తున్నారు. ఇందులో సుమారు 1.50 లక్షల ఎకరాల పైన కౌలు రైతులే సాగు చేస్తున్నారు. జిల్లాలో సుమారు 1.20 లక్షల మంది కౌలు రైతులు ఉంటారని ఒక అంచనాగా ఉంది. కౌలు గుర్తింపు లేక ఏటా వర్షాభావ పరిస్థితులు, తుపాను వంటి ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోతున్నారు. బీమా పరిహారం, బ్యాంకుల నుంచి రుణాలు, ఇన్‌పుట్ సబ్సిడీలు తదితర ప్రయోజనాలు పొందుతున్నారు. వీటిని దృష్టిలో పెట్టుకున్న ప్రభుత్వం పంట సాగు హక్కుదారుల చట్టం-2019 ప్రకారం సాగు హక్కు పత్రాలను జారీ చేసేందుకు సచివాలయాల్లో దరఖాస్తులను స్వీకరించే పని ఇప్పుడు ప్రారంభించింది. గతేడాది 7,700 మందికి రైతులకు కార్డులు అందించారు.



భూ యజమానులు ససేమిరా

గ్రామసభలు నిర్వహించి కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేసే ప్రక్రియ 2019 వరకు సాగింది. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత పంట సాగు హక్కు దారుల చట్టం-2019ను తీసుకొచ్చింది. ఈ చట్టం ప్రకారం కౌలు రైతు గుర్తింపు కార్డు పొందాలంటే భూ యజమాని రాతపూర్వక అగ్రిమెంటు తీసుకోవాలి. అధికశాతం మంది భూ యజమానులు ససేమిరా అంటున్నారు. ఒకట్రెండు ఎకరాల భూమి ఉన్న వారు స్థానిక రైతులకు కౌలుకు ఇచ్చి చాలామంది వలస వెళ్లిపోతున్నారు. ఆధార్‌కార్డు, పాస్‌పుస్తకం కాపీలు ఇవ్వడానికి, రాతపూర్వక సమ్మతి తెలపడానికి వారు రావడానికి ఇష్టపడడం లేదు. భూ యజమానులు అంగీకరించకపోవడంతో వారి కోరిన కౌలు చెల్లించేలా ప్రయివేట్‌గా ఒప్పందాలు కుదుర్చుకుంటున్న పరిస్థితి నెలకొంది. దీంతో భూములు కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నా, పత్రాలకు మాత్రం నోచుకోవడం లేదు. ప్రభుత్వమే హామీగా ఉండి పత్రాలు అందించేలా చూడాలని కౌలు రైతులు కోరుతున్నారు.

కొత్త ప్రభుత్వం కొలువుదీరే వరకు ఆగాల్సిందేనా?

సిసిఆర్‌సి కార్డులు పొందడానికి కొత్త ప్రభుత్వం కొలువుదీరే వరకు ఆగాల్సి ఉంటుందన్న అభిప్రాయం వినిపిస్తోంది. ప్రస్తుతం అధికార యంత్రాంగం ఎన్నికల కౌంటింగ్ పైనే దృష్టిసారించింది. కార్డుల జారీకి మార్గదర్శకాలు, గ్రామసభల నిర్వహణ వంటి అంశాలపై ప్రభుత్వం ఒక సర్క్యులర్ ఇవ్వాల్సి ఉంటుంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో ప్రభుత్వం ఈ అంశానికి ప్రాధాన్యం ఇస్తుందని చెప్పే పరిస్థితి కనిపించడం లేదు. కొత్త ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే కార్డుల జారీ మొదలవుతుందని కూడా చెప్పలేం. దీంతో ఈ ఏడాది కౌలు గుర్తింపుకార్డులు సకాలంలో అందడంపై సందేహాలు నెలకొన్నాయి.

సిసిఆర్‌సి కార్డుల జారీలో నిర్లక్ష్యం

కౌలు రైతులకు సిసిఆర్‌సి కార్డుల జారీలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తీసుకొచ్చిన పంట సాగుదారుల చట్టం-2019తో కౌలు రైతులకు ఎటువంటి ప్రయోజనం కలగలేదు. అక్కడక్కడా కొద్దిమందికి కార్డులు ఇచ్చినా బ్యాంకులు రుణాలు ఇవ్వలేదు. కౌలు రైతుల గుర్తింపు ప్రక్రియను వెంటనే ప్రారంభించి కార్డులు జారీ చేయాలి. భూ యజమానితో సంబంధం లేకుండా ప్రభుత్వం కౌలు రైతులకు సాగు హక్కు పత్రాలను అందించాలి.

- కె.మోహనరావు,
జిల్లా కార్యదర్శి, ఎపి రైతుసంఘం

సాగు హక్కు పత్రాల జారీకి చర్యలు

కౌలు రైతులకు సాగు హక్కు పత్రాల జారీకి చర్యలు తీసుకుంటాం. రుణాలకు ఇబ్బంది లేకుండా ప్రభుత్వం గుర్తింపు కార్డులు జారీ చేస్తుంది. సిసిఆర్‌సి కార్డుల అందజేతకు ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రావాల్సి ఉంది.

- కె.శ్రీధర్,
వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకులు

బాణసంచా విక్రయాలపై నిషేధం

- వ్యాపారస్తులకు నోటీసులు జారీ
- కౌంటింగ్ నేపథ్యంలో అధికారుల ముందుజాగ్రత్త చర్యలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకూ జిల్లాలో బాణసంచా విక్రయాలపై అధికార యంత్రాంగం నిషేధం విధించింది. సార్వత్రిక ఎన్నికలు పూర్తయిన తర్వాత రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో అల్లర్ల నేపథ్యంలో ఇప్పటికే పెట్రోల్ బంకుల్లో లూజు పెట్రోల్, డీజిల్ విక్రయాలపై నిషేధం విధించారు. తాజాగా బాణసంచా విక్రయాలపైనా ఆంక్షలు విధించారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కౌంటింగ్ ప్రక్రియకి సంబంధించిన ముందస్తు కార్యాచరణతో సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. అదే సందర్భంలో శాంతిభద్రతల సమస్యలు ఎక్కడా తలెత్తకుండా అవసరమైన ముందుజాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. ఎన్నికల ఫలితాల నేపథ్యంలో బాణసంచా విక్రయాలు, మందుగుండు సామగ్రి కాల్చేందుకు ఎటువంటి అనుమతులు జారీ చేయరాదని స్పష్టం చేయడంతో, జిల్లా అధికారులు అప్రమత్తమయ్యారు.

మందుగుండు సామగ్రిని వినియోగించి అల్లర్లకు పాల్పడే అవకాశం ఉన్నందున బాణసంచా విక్రయాలపై నిషేధం విధించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో పాటు 144 సెక్షన్ కొనసాగుతున్నందున, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో జిల్లాలోని బాణసంచా విక్రయాలు సాగించే హోల్‌సేల్ వ్యాపారులకు నోటీసులు జారీ చేశారు. ఆయా పోలీస్‌స్టేషన్ల హౌస్ ఆఫీసర్లు కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకూ బాణసంచా విక్రయాలు చేయొద్దని నోటీసుల్లో సూచించారు. ఆయా బాణసంచా వ్యాపారులకి నోటీసులను అందజేశారు. ఫలితాలు వెల్లడయ్యే సమయంలో, ఆ తర్వాత సమస్యలు తలెత్తే అవకాశం ఉండడంతో అధికారులు ముందుజాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు.

రేపట్నుంచి 'పది' సప్లిమెంటరీ పరీక్షలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను ఈనెల 24 నుంచి జూన్ మూడో తేదీ వరకు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వరరావు, పరీక్షల నిర్వహణాధికారి అలీఖాన్ తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని తొమ్మిది పరీక్షా కేంద్రాల్లో సుమారు 2,100 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. ఓపెన్ స్కూల్ ఎస్ఎస్‌సి పరీక్షలు రెండు కేంద్రాల్లో, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ఐదు కేంద్రాల్లో జూన్ ఒకటి నుంచి ఎనిమిదో తేదీ వరకు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు.

మత్స్యకార యువకుడు సత్తా

- నేషనల్ సీడ్స్ కార్పొరేషన్ మేనేజింగ్ ట్రైనీగా ఎంపిక
- ఆలిండియాలో సాయికుమార్‌కు ఐదో ర్యాంకు

సాయికుమార్

సాధించాలన్న తపన ఉండాలే గానీ కష్టాల కడగండ్లు అందుకు అడ్డం కాదని నిరూపించాడు ఆ మత్స్యకార యువకుడు. సంసారమనే సంద్రాన్ని దాటేందుకు కష్టాల కడలి ఈదుతున్న తన తండ్రి కష్టాన్ని చిన్నప్పట్నుంచీ చూస్తూ పెరిగిన ఆ అబ్బాయి, ఆ కడలి కెరటాలను దాటుకుని తీరానికి చేరాడు. తనలాంటి మరెందరికో దిక్సూచిలా మారాడు.

ప్రజాశక్తి - కవిటి

కవిటి మండలం కపాసుకుద్దికి చెందిన మాగుపల్లి సాయికుమార్ నేషనల్ సీడ్స్ కార్పొరేషన్ మేనేజింగ్ ట్రైనీగా ఎంపికై సత్తా చాటాడు. ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు కవిటి ఎస్.వి.జె విద్యాసంస్థల్లో చదివిన సాయికుమార్ అగ్రికల్చర్ డిప్లమా అనకాపల్లిలో, అగ్రికల్చర్ బిఎస్‌సి శ్రీకాకుళం నైరలో, ఎంఎస్‌సి బాపట్లలో పూర్తి చేశాడు. సాయికుమార్ సాధించిన ఈ విజయం వడ్డించిన విస్తరి కాదు. ఎన్నో అవాంతరాలు, మరెన్నో అడ్డంకులు దాటుకుని చేసిన ఓ ఆదర్శవంతమైన ప్రయాణం. ఓ వైపు పూట గడవాలంటే చేపల వేటకు వెళ్లాలి. మరోవైపు అవసరాలు తీరాలంటే అప్పులు చేయాల్సిన కుటుంబ పరిస్థితి నుంచి సాయికుమార్ సాధించిన ఈ ఘనత నేటి యువతకు ఆదర్శప్రాయం.

వలసలకు పుట్టినిల్లు అయిన కవిటి మండలం అందులోనూ మత్స్యకార సామాజిక తరగతికి చెందిన సాయికుమార్‌ది కవిటి మండలం కపాసుకుద్ది గ్రామం. సాయికుమార్ తండ్రి మాగుపల్లి నాయుడు చేపల వేటకు వెళ్తేనే, ఆ కుటుంబానికి భృతి లేదంటే పస్తులే. ఇటువంటి పరిస్థితుల్లో ప్రాథమిక దశలో సోదరుడు శరత్‌కుమార్‌తో పాటు సాయికుమార్ కూడా వేటకు వెళ్లి తండ్రికి సాయపడేవాడు. తల్లి తిరుపతమ్మ వీరి బాగోగులు చూస్తూ కుటుంబాన్ని సాకేది. రెక్కాడితే గానీ డొక్కాడని తమ కుటుంబ పరిస్థితిని గుర్తించిన సాయికుమార్, శరత్‌కుమార్ చదువే తమను సమస్యల నుంచి గట్టెక్కిస్తుందని గుర్తించారు. ఓవైపు వేట కొనసాగిస్తూనే చదువుని నిర్లక్ష్యం చేయకుండా చూసుకున్నారు. పిల్లలకు చదువు మీద ఉన్న ఆసక్తి చూసి వారి తల్లిదండ్రులు కూడా తమవంత పూర్తి సహకారం అందించారు. దీంతో ముందుగా శరత్‌కుమార్ తన చదువు ముగించి ఆర్మీలో చేరాడు. ఈలోగా తండ్రి చనిపోవడంతో మళ్లీ వీరికి సమస్యలు మొదలయ్యాయి. చదువుపై మొక్కవోని దీక్షతో ఉన్న సాయికుమార్ గ్రామీణ ప్రాంతంలో ఉండడంతో మొదట్నుంచీ వ్యవసాయరంగాన్ని నిరంతరం పరిశీలిస్తూ తన చదువు కొంతమంది రైతులకైనా ఉపయోగపడాలనే తపన పడేవాడు. అందులో భాగంగానే అగ్రికల్చర్ డిప్లమో తీసుకుని నిరంతరం శ్రమించి బాపట్లలో అగ్రికల్చర్ పిజి పూర్తి చేశాడు. అనంతరం ప్రకాశం జిల్లాలోని సి.ఎస్ పురం అగ్రికల్చర్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తూ జనవరిలో నిర్వహించిన నేషనల్ సీడ్స్ కార్పొరేషన్ పరీక్ష రాశాడు. ఇన్నేళ్ల అతని శ్రమకు ఆ పరీక్ష ప్రతిఫలం లభించేలా చేసింది. మంగళవారం రాత్రి వచ్చిన తుది ఫలితాల్లో సాయికుమార్ ఆలిండియాలో ఐదో ర్యాంకు సాధించి మేనేజింగ్ ట్రైనీగా ఎంపికయ్యాడు. అంతే ఒక్కసారి తన నేపథ్యం గుర్తుకు తెచ్చుకుని ఉద్వేగానికి లోనయ్యాడు. తన ఉన్నతి కోసం అహరహం శ్రమించిన తన తల్లిదండ్రులు, సోదరునికి ఈ విజయం అంకితమని చెప్పాడు.

ఇంటర్ ప్రవేశాలు ప్రారంభం

సీట్ల కేటాయింపుపై కసరత్తు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ఇంటర్ ప్రవేశాలు ప్రారంభమయ్యాయి. మెరిట్, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా సీట్ల కేటాయింపుపై కసరత్తు చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఈ ప్రక్రియ మొదలైంది. బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ సెక్రటరీ ఆదేశాల మేరకు వారు ఇచ్చిన మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలు చేపట్టారు. మొదట విడత ప్రవేశాలు ప్రారంభం కావడంతో పాటు సీట్ల కేటాయింపులు కూడా జరిగిపోతున్నాయి. శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలల్లో సీట్లకు డిమాండ్ నెలకొంది. ఈ కళాశాలలో చేరడం కోసం జిల్లా నలుమూలల నుంచి కూడా విద్యార్థినులు దరఖాస్తు చేసుకున్నారు. ఈనెల 15 నుంచి దరఖాస్తుల విక్రయాలు చేపట్టారు. మొదట విడత అడ్మిషన్స్‌ను ఈనెల 22న చేపట్టాలని ఉన్నతాధికారులు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఇప్పటివరకు అందిన దరఖాస్తులను ప్రిన్సిపాల్ కృష్ణవేణి, అధ్యాపక బృందం పరిశీలించి మెరిట్, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా సీట్లను కేటాయింపులు చేపడుతున్నారు. ఈ కళాశాలలో ఎంపిసి, బైపిసి, సిఇసి, హెచ్ఇసి వంటి రెగ్యులర్ గ్రూపులతో పాటు కంప్యూటర్స్, ఎంఎల్‌టి, ఎంపిహెచ్‌డబ్ల్యు వంటి ఒకేషనల్ గ్రూపులు ఉన్నాయి.

కేవలం నగరం నుంచే కాకుండా జిల్లా నలుమూలల నుంచి విద్యార్థినులు ఇక్కడ కళాశాలలో చేరడం కోసం పోటీ పడుతున్నారు. మొదట విడత అడ్మిషన్స్ కోసం భారీఎత్తున దరఖాస్తులు అందాయి. జిల్లాలోని మారుమూల ప్రాంతాల నుంచి విద్యార్థినులు ప్రవేశాల కోసం ఇక్కడి కళాశాలలో దరఖాస్తు చేసుకున్నారు. ఇంటర్ బోర్డు ఇచ్చిన షెడ్యూల్ మేరకు మొదట విడత అడ్మిషన్ ప్రక్రియను ఈ కళాశాలలో ప్రారంభించి సీట్ల కేటాయింపులు చేపట్టారు. జూన్ ఒకటో తేదీ లోగా మొదట విడత ప్రవేశాల ప్రక్రియను పూర్తి చేయనున్నారు. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి మొదట ఇంటర్ తరగతులను జూన్ ఒకటో తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. మిగిలి ఉన్న సీట్ల కోసం రెండో విడత ప్రవేశాలను జూన్ పదో తేదీన ప్రారంభించి జూలై ఒకటో తేదీ లోగా పూర్తి చేయనున్నారు. శ్రీకాకుళం విద్యార్థినులతో పాటు తల్లిదండ్రులు, వారి సంరక్షకులు కళాశాల వద్దకు చేరుకోవడంతో ఆ ప్రాంగణమంతా ప్రవేశాలతో కళకళలాడుతుంది. ఎటు చూసినా అడ్మిషన్ల హడావుడే అక్కడ కనిపించింది.

లోగోను ఆవిష్కరిస్తున్న అశోక్

8 నుంచి ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్రస్థాయి తరగతులు

విజయవంతం చేయాలి : అశోక్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఎస్ఎఫ్ఐ రాష్ట్రస్థాయి విద్య, వైజ్ఞానిక శిక్షణా తరగతులను జూన్ 8 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆ సంఘ రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.చందు, బి.హరీష్ తెలిపారు. ఈ తరగతులను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నగరంలోని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో శిక్షణా తరగతుల పోస్టర్, లోగోను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీకాకుళం మండలం చింతాడ రోడ్డులోని జి.ఎల్ ఫంక్షన్ హాల్‌లో ఈ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యలు, విద్యార్థుల హక్కుల కోసం ఎస్ఎఫ్ఐ అలుపెరుగని పోరాటం చేస్తోందని చెప్పారు. దేశంలో మతోన్మాద శక్తులను తరిమికొట్టి లౌకిక ప్రజాస్వామ్య విలువలను కాపాడగలిగేది విద్యార్థులు మాత్రమేనన్నారు. ఇటీవల జెఎన్‌టియు యూనివర్శిటీలో ఎస్ఎఫ్ఐ విజయాన్ని సొంతం చేసుకుందన్నారు. ఆర్ఎస్ఎస్ మతోన్మాద శక్తులను దేశం తరిమికొట్టడానికి ఆ ఎన్నికలు ఆరంభం మాత్రమేనని చెప్పారు.

విద్యార్థులకు శాస్త్రీయ దృక్పథం గల విద్యనందిస్తూ వారిలో సృజనాత్మక శక్తిని వెలుగులోకి తీసుకురావాలన్నారు. రాష్ట్రస్థాయి విద్యా, వైజ్ఞానిక శిక్షణా తరగతులు సృజనాత్మకతను వెలికితీసేందుకు ఎంతగానో దోహదపడతాయన్నారు. శిక్షణా తరగతులకు రాష్ట్ర నలుమూలల నుంచి సుమారు 600 మంది విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ నాయకులు హాజరవుతారని తెలిపారు. నిష్ణాతులైన ప్రొఫెసర్లు విద్యార్థులకు సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తారని చెప్పారు. ఈ శిక్షణా తరగతులకు అభ్యుదయవాదులు, మేధావులు, ఎస్ఎఫ్ఐ అభిమానులు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి సంతోష్, జిల్లా కమిటీ సభ్యులు భూపతి తదితరులు పాల్గొన్నారు.

రేపు డిఇఇ సెట్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

డైట్‌లో ప్రవేశానికి గానూ డిఇఇ సెట్‌ను ఈనెల 24న నిర్వహించనున్నారు. ఈ పరీక్షకు గత నెల 22న నోటిఫికేషన్ విడుదల కాగా, జిల్లావ్యాప్తంగా 360 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. రెండేళ్ల పాటు డిప్లమో ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కోర్సు చదవుకునేందుకు కంప్యూటర్ బేస్‌డ్‌గా ఈ ప్రవేశ పరీక్షను నిర్వహిస్తున్నారు. పరీక్షకు రెండు గంటల సమయాన్ని కేటాయించారు. వంద మార్కులకు ప్రశ్నపత్రం ఉంటుంది. ఈ పరీక్షలో నెగిటివ్ మార్కులు ఉండవు. ఈ పరీక్షకు జిల్లాలో రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎచ్చెర్లలోని వెంకటేశ్వర ఇంజినీరింగ్ కాలేజ్‌లో 90 మంది, నరసన్నపేటలోని కోర్ టెక్నాలజీస్‌లో 270 మంది అభ్యర్థులు హాజరు కానున్నారు. శుక్రవారం ఉదయం పది నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఈ పరీక్షను నిర్వహించనున్నారు. డిఇఇ సెట్‌కు సంబంధించి గ్రీవెన్స్ సెల్‌ను ఏర్పాటు చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు తెలిపారు. పరీక్షకు సంబంధించి సందేహాలు, సమస్యలపై 9505678655 ఫోన్ నంబరును సంప్రదించాలని సూచించారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు హాల్ టిక్కెట్‌తో పాటు ఏదైనా ప్రభుత్వ గుర్తింపు పొందిన ఫొటోతో కూడిన కార్డును తీసుకెళ్లాలని సూచించారు.

శాంతిభద్రతలపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - పలాస

జూన్ నాలుగో తేదీన కౌంటింగ్ నేపథ్యంలో పోలీసులు మరింత అప్రమత్తంగా ఉండాలని, సమస్యాత్మక ప్రాంతాల్లో ఎటువంటి అల్లర్లు చోటుచేసుకోకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆర్‌డిఒ, ఎన్నికల రిటర్నింగ్ అధికారి భరత్ నాయక్ సూచించారు. ఆర్‌డిఒ కార్యాలయంలో పోలీస్ అధికారులతో బుధవారం సమీక్షించారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో కొన్ని ప్రాంతాల్లో కొట్లాటలు, ఘర్షణలు చోటుచేసుకున్నాయని చెప్పారు. ప్రస్తుత పరిస్థితుల రీత్యా మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన రోజు, తర్వాత సమస్యాత్మక ప్రాంతాలపై నిఘా ఉంచాలన్నారు. ఇంతవరకు ఎన్నికల్లో ఎంతమందిపై కేసులు నమోదు చేశారు, ఎంతమందిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారనే నివేదిక అందించాలన్నారు. ఎన్నికల నేపథ్యంలో ఎంతమందిపై బైండోవర్ కేసులు నమోదు చేశారని అడిగి తెలుసుకున్నారు. వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలని సూచించారు. ఇతర ప్రాంతాల నుంచి నియోజకవర్గానికి వచ్చే కొత్త వ్యక్తులపై నిఘా ఉంచాలన్నారు. అనుమానం వస్తే వారిని విచారించి చర్యలు తీసుకోవాలన్నారు. నియోజకవర్గానికి సంబంధించి ఇప్పటి నుంచి కౌంటింగ్ సమయానికి, అనంతరమూ ఎటువంటి హింసాత్మక సంఘటనలు ఘర్షణలు లేకుండా గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తగిన మూల్యం తప్పదని హెచ్చరించారు. సమావేశంలో డిఎస్‌పి నాగేశ్వరరెడ్డి, కాశీబుగ్గ సిఐ కె.విజయనంద్, ఎస్ఐలు పారినాయుడు, వెంకటరావు, రూరల్ సిఐ, వజ్రపుకొత్తూరు ఎస్ఐ పాల్గొన్నారు.

సమీక్షిస్తున్న ఆర్‌డిఒ భరత్‌కుమార్

పిఎం శ్రీ పథకంలో వరం హైస్కూల్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

నగరంలో పేద, మధ్యతరగతి విద్యార్థులు ఇకపై అంతర్జాతీయ ప్రమాణాలతో ప్రభుత్వ స్కూల్లోనే విద్యనభ్యసించడానికి వీలుగా పిఎం శ్రీ పథకంలో ఎవిఎన్ఎం హైస్కూల్ ఎంపికైంది. ఇటీవల సమగ్ర శిక్ష రాష్ట్ర పథక సంచాలకులు బి.శ్రీనివాస్ జిల్లా పర్యటనలో భాగంగా గుజరాతీపేటలో ఈ హైస్కూల్‌ను సందర్శించారు. అక్కడున్న మౌలిక వసతులను పరిశీలించిన ఆయన ఈ పథకంలో స్కూల్‌ను చేర్చారు. ఈ పథకం వల్ల నర్సరీ నుంచి ప్లస్-2 వరకు ఒకే క్యాంపస్‌లో విద్యార్థులు చదువుకునేందుకు వీలవుతుంది. అంతర్జాతీయ ప్రమాణాలు గల విద్యాలయంగా దీన్ని తీర్చిదిద్దడానికి విద్యాశాఖ కమిషనర్ నుంచి ఉత్తర్వులు వచ్చాయి. ఇందులో భాగంగా ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి బి.శాంతిశ్రీ, జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు, శ్రీకాకుళం డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి ఆర్.విజయకుమారి, జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి గుంట లక్ష్మీనారాయణ పాఠశాలను సందర్శించారు. పాఠశాలకు అనుబంధంగా ఉన్న పొందరవీధిలోని హోం విజిట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం సమగ్ర శిక్ష సెక్టోరల్ అధికారుల బృందం అందుబాటులో ఉన్న డేటా ప్రకారం ఆ ఈడు పిల్లల ఇంటింటికి ప్రవేశాలు కోరుతూ పాఠశాల ప్రత్యేకతలను తల్లితండ్రులకు వివరించారు. వారితో పాటు సిడిపిఒ శోభారాణి పాల్గొన్నారు.

చిన్నారులతో మాట్లాడుతున్న ఐసిడిఎస్ పీడీ

మాట్లాడుతున్న లక్ష్మణరావు

కేసుల్లేని వారే ఏజెంట్లుగా ఉండాలి

ప్రజాశక్తి- రణస్థలం
సార్వత్రిక ఎన్నికల్లో పోటీలో ఉన్న అభ్యర్థులు నియోజకవర్గంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఎచ్చెర్ల నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎస్.వి.లక్ష్మణమూర్తి సూచించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియపై రాజకీయ పార్టీ ప్రతినిధులతో బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గుర్తింపు పొందిన ప్రధాన పార్టీలు వారి వారి ఏజెంట్లను నియమాకానికి ఫారం-18ల ద్వారా రెండు సెట్లను త్వరితగతిని అందించాలన్నారు. ఒక సెట్ను పోలీసులకు పంపించాలన్నారు. వారిపై ఎలాంటి కేసులు లేని వారినే కౌంటింగ్ ఏజెంట్లుగా నియమిస్తామని స్పష్టం చేశారు. ఎచ్చెర్ల మండలంలోని శివాని కళాశాల కౌంటింగ్ కేంద్రం చుట్టూ పటిష్ట భద్రతను ఏర్పాటు చేశామని, అక్కడ వంద మీటర్లలోపు ఎవరి వాహనాలకూ అనుమతులు లేవని చెప్పారు. గుర్తింపు కార్డులు ఉన్నవారిని మాత్రమే అనుమతిస్తామన్నారు.

చిత్రలేఖనం పోటీలు

టెక్కలి : వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా టెక్కలి శాఖాగ్రంథాలయంలో బుధవారం చిన్నారులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి బి.రూపావతి ఆధ్వర్యాన నిర్వహించిన ఈ పోటీల్లో భాగంగా ఆమె మాట్లాడారు. ప్రాథమికస్థాయి నుంచే విద్యార్థులకు సృజనాత్మకత అలవడాలన్నారు. అనంతరం విద్యార్థులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది అమ్మనమ్మ పాల్గొన్నారు.

నందిగాం: విద్యార్థి మనుగడకు ఉపన్యాస చొరవ చూపడం ఎంతైనా అవసరమని శాఖాగ్రంథాలయ అధికారి ఎస్.ఉదయ్ కిరణ్ అన్నారు. స్థానిక శాఖాగ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా బుధవారం వకృత్వ పోటీలు నిర్వహించారు. జూనియర్ సీనియర్ విభాగాలుగా విభజించి నియర్ విభాగానికి గ్లోబల్ వార్మింగ్ అనే అంశంపై జూనియర్ విభాగానికి మానవత్వం అనే అంశంపై డిబేట్ నిర్వహించారు.

సేంద్రీయ వ్యవసాయంపై అవగాహన

శ్రీకాకుళం రూరల్ : జిల్లాలో సేంద్రీయ వ్యవసాయాన్ని అభివృద్ధి చేయడానికి రైతుల్లో అవగాహన పెరగాలని, అందుకోసం శాస్త్రవేత్తలు, విద్యార్థులు గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించాలని నైర ఎన్జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవసాయ కళాశాల డీన్ డాక్టర్ భరత్లక్ష్మి అన్నారు. శ్రీకాకుళం రూరల్ మండలం వెంకటాపురంలో జాతీయ సేవా శిబిరాన్ని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూముల సారాన్ని కోల్పోకుండా ఉండాలంటే తప్పక సేంద్రీయ పద్ధతుల్లో సాగు చేసుకోవాలన్నారు. వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ కె.మధుకుమార్ కలుపు నివారణా పద్ధతులను రైతులకు వివరించారు. ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ చిట్టిబాబు వరిలో చీడపీడల నివారణకు రైతులు పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో నైర శాస్త్రవేత్త డాక్టర్ జె.జగన్నాథం, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్తలు డాక్టర్ బి.జ్యోతిబసు, డాక్టర్ లక్ష్మీదుర్గ, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డీన్ భరత్లక్ష్మి

లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్గా రవికుమార్

రవికుమార్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్
ఇంటర్నేషనల్ లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్గా పొన్నాడ రవి కుమార్కు చోటు దక్కింది. 2019లో లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ సభ్యునిగా చేరి క్లబ్ ట్రెజరర్గా, సెక్రటరీగా, వైస్ ప్రెసిడెంట్, ప్రెసిడెంట్గా సేవలు అందించారు. ప్రెసిడెంట్గా లయన్స్ ద్వారా చేపట్టిన కార్యక్రమాలను గుర్తించి ఆయనకు జోన్ చైర్మన్ పదవి దక్కించుకున్నారు. ఆయనకు క్లబ్ మెంటార్ నటుకుల మోహన్, డాక్టర్ బి.దేవభూషణం, డాక్టర్ బి.సురేష్, డాక్టర్ పైడి సింధూరలు అభినందనలు తెలిపారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

నందిగాం : మండలంలోని నరేంద్రపురానికి చెందిన జీర్ మోహనరావు తెలుగు వెలుగు సాహితీ ఉగాది ఉత్సవానికి సంబంధించి జాతీయ పురస్కారాన్ని ఇటీవల అందుకున్నారు. ఈ మేరకు టిడిపి కార్యాలయంలో టిడిపి నాయకులు బుధవారం దుశ్శాలువ కప్పి సన్మానించారు. టిడిపి నాయకులు ఎం.బాలకృష్ణ, పి.జయ కుమార్, పోలాకి చంద్రశేఖరరావు, తూలుగు మహేష్, కె.ప్రసాదరావు, ఎస్.జానకిరామ్, ఎ.సుదర్శనరావు, ముదిని సింహాచలం, సమ్మోహనరావు పాల్గొన్నారు.

సన్మానిస్తున్న టిడిపి నాయకులు

ముమ్మరంగా తనిఖీలు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం
మండలంలోని బాలకృష్ణాపురంలో రూరల్ ఎస్ఐ లక్ష్మణరావు, కవిటి ఎస్ఐ రాము ఆధ్వర్యాన కార్డాన్సెర్చ్లో భాగంగా బుధవారం ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. ఎటువంటి పత్రాలు లేని నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వచ్చే ఎన్నికల ఫలితాల నేపథ్యంలో గ్రామాల్లో ఎటువంటి గొడవలు, ఘర్షణలు తలెత్తకుండా ప్రశాంత వాతావరణానికి సహకరించాలని కోరారు. పోలీస్ అధికారులు అనుమతి లేకుండా ఎటువంటి సభలు, సమావేశాలు పెట్టకూడదని సూచించారు.

పోలాకి: మండలంలో ఈదులవలసలో సిఐ ప్రసాదరావు, ఎస్ఐ సత్యనారాయణ ఆధ్వర్యాన కార్డాన్సెర్చ్ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఇంట్లో ఉన్న వ్యక్తులు పేర్లు, వారి ఆదార్ కార్డులను పరిశీలించారు. అలాగే వాహనాల పత్రాలు సక్రమంగా ఉన్నవి, లేనివి పరిశీలించారు. ఎన్నికల నియమావళి అమలలో ఉందని, గ్రామంలో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు పాల్పడకూడదని సూచించారు. అలాగే అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. 144 సెక్షన్ అమలులో ఉన్నందున గుంపులు గుంపులుగా ఉండరాదన్నారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేసినట్లు నిర్ధారణ అయితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఇచ్ఛాపురం : వాహనాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు

టెక్కలి రూరల్ : మండలంలోని సోగ్గాడపేట, చేరివీధిలో సిఐ పైడయ్య ఆధ్వర్యాన కార్డాన్సెర్చ్ నిర్వహించారు. వాహనాల పత్రాలను పరిశీలించారు. సరైన పత్రాలు లేని నాలుగు వాహనాలను సీజ్ చేశారు.

పలాస : పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 3వ వార్డు జయరామచంద్రపురంలో బుధవారం ఉదయం కాశీబుగ్గ పోలీసుల ఆధ్వర్యాన కార్డెన్సెర్చ్ నిర్వహించారు. ఎటువంటి పత్రాలు లేని మొత్తం నాలుగు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఎన్నికల వేళ ఈ గ్రామంలో చిన్నపాటి ఘర్షణలు చోటుచేసుకోవడంతో పోలీసులు కార్డాన్సెర్చ్ నిర్వహించడం ప్రాధాన్యత సంతరించుకుంది. నాటుసారా, మద్యం నిల్వపై దృష్టిసారించారు.


ur A/C XXX45000 had a By Transfe
n of RS.18750.00 Credit on 19/05/24
11:34.Cur bal:Rs.19130.37 CR.Visit
gvbank.in/digi to go Digital. APGVB

చేయూత డబ్బులు అందినట్టు వచ్చిన మేసేజ్

'చేయూత' అందుతోంది

కవిటి: బిసి, ఎస్సి, ఎస్టి, మైనారిటీలకు చెందిన 45-60 సంవత్సరాల మధ్య వయసు కలిగిన మహిళలకు ప్రభుత్వం ఏటా అందిస్తున్న చేయూత పథకం డబ్బులు నాలుగు రోజులుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమవుతు న్నాయి. వాస్తవానికి చేయూత పథకానికి సంబంధించి మార్చిలోనే బటన్ నొక్కినా కొన్ని అనివార్య కారణాల వల్ల లబ్ధిదారుల ఖాతాలకు నగదు జమ కాలేదు. దీంతో చేయూత పథకం కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారులు డబ్బులు వస్తాయో, రావో అనే మీమాంశతో సతమతయ్యారు. అదే విషయాన్ని ప్రజాశక్తి ఏప్రిల్ 26న చేయూత అంతేనా? అంటూ కథనం ప్రచురించింది. తదనంతరం ఎన్నికల ప్రక్రియ ముగిసిన వెంటనే చేయూతతో పాటు విద్యా దీవెన డబ్బులు కూడా ఖాతాల్లోకి ప్రభుత్వం జమ చేస్తుండడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న రఘువర్మ

సంజీవరావు సేవలు ఎనలేనివి

పొందూరు: ఎపిటిఎఫ్ సంఘ పటిష్టతకు కోటిపాత్రుని సంజీవరావు మాస్టర్ ఎంతగానో కృషి చేశారని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాలకపాటి రఘువర్మ అన్నారు. మండలంలోని తోలాపిలో ఇటీవల మృతి చెందిన సంజీవరావు మాస్టర్ సంతాపసభను బుధవారం నిర్వహించారు. ముందుగా సంజీవరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సంజీవరావు వృత్తిపై నీతి నిజాయితీతో పాటు, ఎపిటిఎఫ్ సంఘ అభివృద్ధికి ఎనలేని సేవ చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఎపిటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భానుమూర్తి, రాష్ట్ర కార్యదర్శి బి.సరస్వతి, జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్కుమార్, రాష్ట్ర కౌన్సిలర్ విజయకుమార్, జిల్లా కార్యదర్శి తిరుమలరావు, జిల్లా పూర్వ కార్యదర్శి లక్ష్మణరావు, మండల ఉపాధ్యక్షులు శ్రీనివాసరావు, మండల ప్రధాన కార్యదర్శి తేజేశ్వరరావు పాల్గొన్నారు.

రసాభాసగా మండల సమావేశం

కొత్తూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి సవర సావిత్రి అధ్యక్షతన బుధవారం నిర్వహించిన మండల సమావేశం రసాభాసగా సాగింది. ప్రోటోకాల్ ప్రకారం డయాస్పైకి ఎంపిపి పిఎసిఎస్ అధ్యక్షులు చింతాడ సూర్యనారాయణను ఆహ్వానించారు. దీంతో మెట్టూరు బిట్-3 సర్పంచ్ కోయిలాపు శ్రీనివాసరావు అభ్యంతరం తెలిపారు. గత సమావేశాల్లో పిఎసిఎస్ అధ్యక్షులను ఆహ్వానించలేదని, ఇప్పుడు ఎలా ఆహ్వానిస్తారని ప్రశ్నించారు. దీనిపై మాతల సర్పంచ్ ప్రతినిధి కలమట రమేష్, గూనభద్ర, సర్పంచ్ ప్రతినిధి వైకుంఠరావు ఎంపిపి ఇష్టం ప్రకారం ఆహ్వానిస్తారని, దీనిపై అభ్యంతరం ఎందుకుని తిరిగి ప్రశ్నించారు. దీంతో శ్రీనివాసరావుతో వాగ్వివాదానికి దిగారు. మాటామాటా పెరిగి తోపులాటకు దారితీసింది. కుర్చీలు ఒకరిపై ఒకరు విసుకున్నారు. దీంతో మండల సమావేశం రసాభాసగా మారింది. అయితే ఎంపిపి త్రివిక్రమరావు ఉదయం 11 గంటలకు మండల సమావేశమని నిర్ణయించి, 10.30 గంటలకే ప్రారంభించడంతో గందరగోళానికి దారితీసింది. సమావేశంలో వైస్ ఎంపిపి తులసీవరప్రసాదరావు, ప్రత్యేకాహ్వానితులు అంపిలి ప్రశాంత్కుమార్, బసవ రాంబాబు పాల్గొన్నారు.

స్టాల్స్ను ప్రదర్శిస్తున్న శ్రీనివాసరావు

జీవవైవిధ్య సదస్సుకు బ్రాహ్మణతర్లా సైన్స్ టీచర్

ప్రజాశక్తి- పలాస
అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవం పురస్కరించుకుని విశాఖలోని ఆంధ్రా యూనివర్సిటీలో బుధవారం నుంచి రెండు రోజులు నిర్వహించే జాతీయ జీవవైవిధ్య సదస్సుకు మండలంలోని బ్రాహ్మణతర్లా జెడ్పి ఉన్నత పాఠశాలకు చెందిన సైన్స్ ఉపాధ్యాయుడు, నేషనల్ గ్రీన్కోర్ క్లస్టర్ సమన్వయకర్త శ్రీనివాసరావు పాల్గొన్నారు. జాతీయ జీవవైవిధ్య సంస్థ, ఆంధ్రప్రదేశ్ జీవవైవిధ్య మండలి సంయుక్తంగా నిర్వహించిన ఈ సదస్సుకు ఎనిమిది రాష్ట్రాలు, జీవవైవిధ్య శాస్త్రీయ సంస్థలు ప్రదర్శించిన స్టాళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ జీవవైవిధ్య సంరక్షణపై తను నేర్చుకున్న విషయాలను విద్యార్థులకు తెలియజేసి.. జీవవైవిధ్య పరిరక్షణకు తనవంతు చేస్తానన్నారు. భూమిపై జీవరాశి మనుగడకు వైవిధ్యం అవసరమన్నారు. రోజురోజుకీ పెరుగుతున్న వాతావరణ కాలుష్యం వల్ల అనేక జీవరాసులు తమ మనుగడను కోల్పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

లయన్స్ జిల్లా చైర్మన్గా హారికాప్రసాద్

శ్రీకాకుళం అర్బన్ : హర్షవల్లి లయన్స్ క్లబ్ ఆఫ్ శ్రీకాకుళం వ్యవస్థాపకులు హారికాప్రసాద్ను లయన్స్ జిల్లా చైర్మన్గాను, ఆయన భార్య శోబారాణిని జోనల్ చైర్మన్గా లయన్స్ క్లబ్ 316ఎ ఇంటర్నేషనల్ సంస్థ నియమించింది. ఈ నేపథ్యంలో నగరంలోని హర్షవల్లి లయన్స్ క్లబ్ కార్యాలయంలో బుధవారం క్లబ్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. హర్షవల్లి లయన్స్ క్లబ్ అధ్యక్షునిగా జగన్నాథం నాయుడు ఎన్నికయ్యారు. సర్వసభ్య సమావేశంలో ఎన్నిక పరిశీలకులుగా డాక్టర్ చింతాడ కృష్ణమోహన్, ఎంజెఎఫ్లు వ్యవహరించారు. ఎన్నిక అనంతరం హారికాప్రసాద్ దంపతులు మాట్లాడుతూ హర్షవల్లి లయన్స్ క్లబ్ సేవలకు గుర్తింపుగా అరుదైన గౌరవం దక్కిందన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

సమావేశంలో మాట్లాడుతున్న హారికాప్రసాద్

హర్షవల్లి లయన్స్ క్లబ్ అధ్యక్షునిగా వావిలపల్లి జగన్నాథంనాయుడు, కార్యదర్శిగా మణిశర్మ, కోశాధికారిగా లక్ష్మీకాంత్, ఉపాధ్యక్షులుగా తర్లాడ అప్పలనాయుడు, పాలిశెట్టి మధుబాబు, ఉషారాణి కల్లెపల్లి, శిరీష చింతాడ, వెంకునాయుడు మజ్జి సుమన్లను ఎన్నుకున్నారు.

నాటుసారాను స్వాధీనం చేసుకున్న పోలీసులు

నాటుసారా స్వాధీనం

మెళియాపుట్టి : మండలంలో చీడిపాలెంలో కార్డెన్ చర్చ్లో భాగంగా బుధవారం నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 45 లీటర్ల నాటు సారాను, 1200 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. కార్యక్రమంలో టెక్కలి సెబి సిఐ రాజశేఖర్ నాయుడు, పలాస డిటిఎఫ్ సిఐ పి.రామచంద్రకుమార్, సెబి ఎస్ఐ జి.గణేష్, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే మండలంలో గొల్లభంజీరులో కార్డాన్సెర్చ్లో భాగంగా 25 లీటర్ల నాటుసారాను, 300 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ టి.రాజేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి

ప్రజాశక్తి- రణస్థలం
రైతులు నేలలోని లభ్య పోషకాల గురించి అవగాహన పెంచుకోవడం వల్ల ఏ నేలలో ఏ పంట వేస్తే మంచి దిగుబడులు వస్తాయో తెలుసుకోవచ్చునని, ఆ పంటలు వేయడం వల్ల ఆశించిన దిగుబడులు సాధించవచ్చని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ డిప్యూటీ మేనేజర్ ఆర్.హరిబాబు అన్నారు. మండలంలోని కొండములగాంకు చెందిన రెడ్డి చిన్నంనాయుడుకు చెందిన పొలంలో బుధవారం భూసార పరీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోతాదుకు మించి రసాయన ఎరువులు వాడడం, పంట వ్యర్థాలను కాల్చడం వల్ల నేలకు అవసరమైన సూక్ష్మజీవులు చనిపోయి, నేల సారవంతం కోల్పోయి కాలుష్యానికి గురవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ శ్రీకాకుళం ఏరియా మేనేజర్ పి.తవిటినాయుడు, సిబ్బంది వై.లహరి, రావాడ కృష్ణ, పిషిణి రమణ తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

శివాజీని సన్మానిస్తున్న టిడిపి నాయకులు

శివాజీ జన్మదిన వేడుకలు

పలాస : స్థానిక టిడిపి కార్యాలయంలో మాజీ మంత్రి గౌతు శ్యాం సుందర శివాజీ జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు నడుమ కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. శివాజీ, విజయమ్మ దంపతులకు దుశ్శాలువ కప్పి సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, పీరుకట్ల విఠల్రావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, టంకాల రవి శంకర్ గుప్తా, దువ్వాడ శ్రీకాంత్, దువ్వాడ హేంబాబు చౌదరి, కొర్ల కన్నారావు, మల్లా శ్రీనివాసరావు, బి.నాగరాజు, దానేటి పద్మజీ, యవ్వరి మోహనరావు, డొక్కరి శంకర్, కొరికాన శంకర్ పాల్గొన్నారు.

జెసిఐకి 11 అవార్డులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్
మిడ్ఖాన్ సందర్భంగా విశాఖలో ప్రయివేటు హోటల్లో జెసిఐ ఆధ్వర్యాన అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. జెసిఐ పలు సేవా కార్యక్రమాలతో పాటు ట్రైనింగ్ ప్రోగ్రామ్స్, పేదవారికి నిత్యవసర వస్తువులు, వేసవి తాపాన్ని తీర్చడానికి మజ్జిగ పంపిణీ, రక్తదాన శిబిరాలు నిర్వహించడంలో కృషి చేసింది. ఇందుకు గాను అధ్యక్షులు కూన అనిల్ కుమార్కు కమ్యూనిటీ సర్వీస్ మేనేజ్మెంట్, ట్రైనింగ్, గ్రీనరీ డవలప్మెంట్ వంటి ఐదు అవార్డులు అందుకున్నారు. అలాగే మెయిన్ వ్యవస్థాపకులు జామ్ భీమశంకర్, అధ్యక్షులు కూన అనిల్ కుమార్లు జెడ్విపి సాయి సుధీర్ చేతుల మీదుగా అవార్డులను అందుకున్నారు. అవుట్స్టాండింగ్లో ఎల్ఓ ఆఫీసర్ బొడిగి మధు, అవుట్ స్టాండింగ్ జెసి ఎ.సంతోష్, అవుట్ స్టాండింగ్ న్యూ జెసిఐ కె.జైకృష్ణ, బెస్టు సపోర్టర్ ప్రదీప్లకు అవార్డులు దక్కాయి. కార్యక్రమంలో నేషనల్ వైస్ ప్రెసిడెంట్ అనిరుథ్, జోన్ మెంటర్ కె.వి.రావు, జెసిఐ అడ్వైయిజర్లు పవన్, రజిత్ పూసర్ల, జోన్ అధ్యక్షులు గొంప సురేష్ పాల్గొన్నారు.



అవార్డును అందుకుంటున్న అనిల్కుమార్

మృతుని వివరాలు తెలియజేయాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస
పురపాలక సంఘంలోని 8వ వార్డు బి.ఆర్.నగర్ సమీపంలో మంగళవారం అనుమానాస్పదంగా మృతి చెందిన వ్యక్తి ఫొటోను గుర్తించి వివరాలను తెలియజేయాలని ఎస్ఐ కె.వెంకటేష్ తెలిపారు. ఈ మేరకు బుధవారం విలేకరులతో మాట్లాడారు. మానసిక వ్యాధిగ్రస్తుడిగా ఆ ప్రాంతంలో తిరుగుతూ చనిపోయిన గుర్తు తెలియని వ్యక్తి మృతిపై కేసు నమోదు చేసి మృతదేహాన్ని జిల్లా సర్వజనా స్పత్రికి తరలించి భద్రపరిచామని తెలిపారు. ఇప్పటికే జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లకు సమాచారం అందించామని అన్నారు. మృతుని గుర్తించిన సమాచారం ఎవరికైనా తెలిస్తే ఆమదాలవలస సర్కిల్ ఇన్స్పెక్టర్ 6309990823, ఎస్ఐ 6309990854 సెల్ నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

గ్రామాల్లో పోలీసులు జల్లెడ

పెట్రోల్ విక్రయాలపై నిఘా

ప్రజాశక్తి- టెక్కలి
టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు ఆచ్చెన్నాయుడు, వైసిపికి చెందిన ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్లు ప్రాతినిధ్యం వహిస్తున్న టెక్కలి నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో పోలీసులు జల్లెడపడుతున్నారు. ఎన్నికలు సజావుగా ముగిసినా... ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో అల్లర్లు జరగకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా పోలీసులు అప్రమత్తమవుతున్నారు. టెక్కలి నియోజకవర్గంలో టిడిపి అభ్యర్థి అభిమానులు రిగ్గింగ్కి పాల్పడే అవకాశం ఉందంటూ ఎన్నికల కమిషన్కు ఫిర్యాదు చేశారు. ఎన్నికల తరువాత కూడా వైసిపి అభ్యర్థి రిగ్గింగ్కు పాల్పడ్డారని చెప్పడంతో పోలీసులు సీరియస్గా తీసుకున్నారు. పోలింగ్ తర్వాత మూలపేట పోర్టు నిర్మాణానికి చెందిన వాహనాలను టిడిపికి చెందిన వారు నిలిపివేస్తారనే ఒక ప్రచారం జరిగింది. దీంతో పోలీసులు అప్రమత్తమై అదనపు బలగాలను రప్పించి గ్రామాల్లో మోహరించారు. ఇదిలా ఉండగా ఎంపీగా పోటీ చేసిన ప్రధాన పార్టీల అభ్యర్థులూ టెక్కలి నియోజకవర్గానికి చెందిన వారే కావడంతో పోలీసులు మరింతగా అప్రమత్తమయ్యారు. రెవెన్యూ, పోలీస్ యంత్రాంగాలు సంయుక్తంగా సమాయత్తమై గ్రామాల్లో అవగాహనా సదస్సులు నిర్వహిస్తున్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో గ్రామాల్లో ఎటువంటి వివాదాలకు తావివ్వవద్దని, ప్రధాన పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఎటువంటి కవ్వింపు చర్యలకు పాల్పడవద్దని ఆదేశించారు. అనుమానిత గ్రామాల్లో కార్డాన్సెర్చ్ నిర్వహించి అవగాహన కల్పిస్తున్నారు. ఇటీవల బూరగాం, రావివలస, టెక్కలి ప్రాంతాల్లో కార్డాన్సెర్చ్ నిర్వహించారు. అలాగే పలువురిపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. సోషల్ మీడియాపై కఠిన ఆంక్షలు విధించారు. పెట్రోల్ బంకుల్లో వాహనాలకు మాత్రమే పెట్రోల్ అమ్మకాలు చేపట్టాలని, లూజ్ విక్రయాలు చేపట్టవద్దని సంబంధిత బంక్ యాజమనులకు ఆదేశాలు జారీచేశారు. అలాగే ఎక్కువగా పెట్రోల్ కొనుగోళ్లు చేస్తున్నారా? అనే అంశంపై ఆరా తీస్తున్నారు. ఏదేమైనా ఎన్నికల ఫలితాలు అనంతరం టెక్కలిలో ఎటువంటి ఆవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసులు, రెవెన్యూ యంత్రాంగం అప్రమత్తమయ్యారు.

తలకొరివి పెడుతున్న కుమార్తె రవళి

తండ్రికి కుమార్తె తలకొరివి

పాతపట్నం: మండలంలోని రౌతులక్ష్మీపురానికి చెందిన తూలుగు రామారావు (65) అనారోగ్యంతో మృతి చెందారు. ఆయనకు ఏకైక కుమార్తె రవళి ఉన్నారు. ఆమె బాధను దిగమింగుకొని తండ్రికి తలకొరివి పెట్టి కర్మకాండ చేసింది. రామారావుకి భార్య భారతమ్మ ఉన్నారు. సర్పంచ్ అంపోలు శ్రీదేవి, ఎంపిటిసి రెడ్డి అపర్ణ, రామరాజు ఛారిటబుల్ ట్రస్టు అధ్యక్షులు పారశెల్లి రామరాజు, గ్రామస్తులు ప్రగాఢ సానుభూతిని కుటుంబ సభ్యులకు తెలియజేశారు.

26న రక్తదాన శిబిరం

రణస్థలం: రణస్థలం మండల కేంద్రంలోని సూర్య ఆస్పత్రి వద్ద సేవా ఫౌండేషన్ ఆధ్వర్యాన ఈ నెల 26న రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు సేవా పౌండేషన్ అధ్యక్షులు ఇడదాసుల తిరుపతిరాజు ఒక ప్రకటనలో తెలిపారు. రక్తదాన శిబిరం ఉదయం 9 గంటల నుంచి ప్రారంభమవుతుందని అన్నారు. రక్తదాతలు వచ్చి రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలుస్తారని పిలుపునిచ్చారు. మరిన్ని వివరాలకు 9848004156 సెల్ నంబరును సంప్రదించాలని కోరారు.

కరెంటు కోతలపై గ్రామస్తుల ఆందోళన

వజ్రపుకొత్తూరు: విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో నాలుగు రోజులుగా విద్యుత్ కష్టాలు అనుభవిస్తున్నమని కొత్తపేట గ్రామస్తులు అవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు స్థానిక సచివాలయం వద్ద సర్పంచ్ అంబటి శ్రీను ఆధ్వర్యాన గ్రామస్తులు బుధవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ విద్యుత్ హెచ్చు, తగ్గులు వల్ల వైర్లు కాలిపోవడంతో పాటు మంటలు వస్తున్నాయని అన్నారు. చాలాసార్లు విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదని వాపోయారు. మంత్రి అప్పలరాజు దృష్టికి తీసుకెళ్లి అధికారులతో మాట్లాడించినా ప్రయోజనం లేకుండాపోయిందని అన్నారు. ఇటీవల గ్రామ సంబరాలు నిర్వహించే ముందు స్థానిక విద్యుత్ ఎఇని కలిసి విద్యుత్ సమస్యలు లేకుండా చూడాలని కోరామని అన్నారు. ఈ విషయంపై స్థానిక విద్యుత్శాఖ ఇన్ఛార్జి ఎఇ యోగిను ఫోన్లో సంప్రదించగా ఆయన అందుబాటులోకి రాలేదు. కార్యక్రమంలో బిజెపి మత్స్యకారుల జిల్లా కన్వీనర్ గుంట ధనారాజు, సైనిక సేవా సంఘం అధ్యక్షుడు గుంటు బాలరాజు, ఎల్.యోగేష్, ఎన్.రాజులు, కె.కొర్లయ్య పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి- సరుబుజ్జిలి
సరుబుజ్జిలి గ్రామ పరిధిలో 11 కెవి ఫీడర్ పరిధిలో మరమ్మతులు, తీగలను అమర్చుట చెట్ల కొమ్మలు తొలగిస్తున్నామని, అందుకు గురువారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాల నిలుపుదల చేస్తున్నామని విద్యుత్శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సత్తారు బయ్యన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. పోలీస్స్టేషన్, వెన్నెలవలస, నందికొండ, సరుబుజ్జిలి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నామని అన్నారు. ఈ అసౌకర్యాన్ని ప్రజలు గ్రహించి విద్యుత్ శాఖ అధికారులకు సహకరించాలని కోరారు.

మృతి చెందిన హేమలత

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ప్రజాశక్తి- పాతపట్నం
మండలంలోని ద్వారకాపురం గ్రామ సమీపంలో బుధవారం సంభవించిన రోడ్డు ప్రమాదంలో తూముకొండకు చెందిన కోట హేమలత (45) మృతి చెందింది. వివరాల్లోకి వెళ్తే... ఉదయం వారి కన్నవారి గ్రామం మండలంలోని బడ్డుమారి పంచాయతీలోని శిష్టిజగన్నాథపురంలో నిర్వహించిన బారసాల ఫంక్షన్కు తన కుమారుడు మనోజ్తో కలిసి వెళ్లింది. తిరుగు ప్రయాణంలో మరలా పాతపట్నం వెళ్లడానికి ఆ గ్రామానికి చెందిన గురుమూర్తితో కలిసి ముగ్గురు బైక్పై వచ్చారు. ఈ సమయంలో టెక్కలి నుంచి పాతపట్నం వైపు కొద్ది సమయం ముందు ఆర్టిసి బస్సు వెళ్లిపోయింది. దీనిని గమనించిన గురుమూర్తి బస్సుకు అందవడానికి ఆ బస్సు వెనుకాలే బైక్పై వేగంగా వెళ్లాడు. ద్వారకాపురం సమీపంలో బస్సును దాటి ముందుకు వెళ్లాడు. ఈ క్రమంలో బైక్ అదుపు తప్పి బోల్తా పడడంతో ముగ్గురూ రోడ్డుపై పడిపోయారు. వెనుక నుంచి వస్తున్న ఆర్టిసి బస్సు డ్రైవర్ నియంత్రించలేకపోవడం, అతి సమీపం కావడంతో ఆమెపై నుంచి వెళ్లిపోయింది. బస్సు చక్రాల కింద నలిగిపోవడంతో ప్రమాద స్థలంలోనే మృతి చెందింది. బైక్ నడుపుతున్న గురుమూర్తి, మృతిరాలి కుమారుడు మనోజ్లకు స్వల్ప గాయాలయ్యాయి. మృతురాలి భర్త గత కొంతకాలం క్రితం మృతి చెందారు. మృతురాలికి కుసుమ, మృణాళిని, మనోజ్ ముగ్గురు సంతానం. పెద్ద కుమార్తెకు ఎనిమిది నెలల క్రితమే వివాహమైంది. ఆమె మృతితో మిగతా ఇద్దరు పిల్లలు దిక్కులేని వారయ్యారని గ్రామస్తులు, బంధువులు రోదిస్తున్నారు. డ్రైవర్ బస్సును ఆపకుండా పాతపట్నం పోలీస్స్టేషన్కు వెళ్లి జరిగిన విషయం చెప్పి లొంగిపోయాడు. సమాచారం తెలుసుకున్న శిష్టిజగన్నాథపురం గ్రామస్తులు ఘటనా స్థలానికి చేరుకుని తరువాత వచ్చే ఆర్టిసి బస్సులను నిలుపుదల చేసి ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న టెక్కలి ఆర్టిసి డిపో మేనేజర్ శ్రీనివాసరావు, ఆదివాసీ యూనియన్ జిల్లా అధ్యక్షులు చౌదరి లక్ష్మీనారాయణ, పడాల ఆదయ్య, సిఐ నల్లి సాయి, పాతపట్నం, మెళియాపుట్టి ఎస్ఐలు మహ్మద్ యాసిన్, జి.రాజేష్లు వచ్చి చర్చించారు. మృతురాలి కుటుంబానికి న్యాయం చేస్తామని హామీనివ్వడంతో ఆందోళన విరమించారు. ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత ఆత్మహత్య

ఇచ్ఛాపురం: మండలంలోని డొంకూరుకు చెందిన వాసుపల్లి ఉష (30) తలనొప్పి భరించలేక బుధవారం ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొంతకాలంగా ఉష మైగ్రేన్ తల నొప్పితో బాధపడుతుంది. వైద్య పరీక్షలు నిర్వహించినా ప్రయోజనం లేకుండాపోయింది. బుధవారం కూడా ఎక్కువ కావడంతో మనస్తాపానికి గురైంది. ఇంట్లో ఎవరూ లేని సమయం చూసుకుని ఫ్యాన్ కొక్కానికి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కొద్ది సమయం తరువాత భర్త రామారావు ఇంటికి వచ్చి చూడగా... వేలాడుతూ కనిపించింది. గ్రామస్తుల సహకారంతో కిందకు దించి చూడగా అప్పటికే మృతి చెందింది. భర్త ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్ఐ లక్ష్మణరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. పదేళ్ల నందన, ఐదేళ్ల రుత్విక పిల్లలు ఉన్నారు. తల్లి ఆత్మహత్య చేసుకోవడంతో పిల్లలు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

ఉష మృతదేహం

కుమారుని మృతి తట్టుకోలేక తల్లి ఆత్మహత్యాయత్నం

టెక్కలి రూరల్: మండలంలోని రావివలస పంచాయతీ చిన్ననారాయణపురానికి చెందిన దాసరి నిరీష అనే వివాహిత బుధవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈమె కుమారుడి సాయివినీత్ పాముకాటుతో మంగళవారం మృతి చెందారు. కన్న కుమారుడు కళ్లముందే కట్టెలపై కాలి బూడిదగా మారిన ఘటనని తట్టుకోలేకపోయింది. దీంతో ఆమె ఇంటిలో ఉన్న నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అపస్మారక స్థితికి చేరుకున్న ఈమెని కుటుంబ సభ్యులు టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఈమె చికిత్స పొందుతుంది.

చికిత్స పొందుతున్న నిరీష